

## నువ్వు-నేను

మనసు మూగపోయింది
పెదవి నవ్వనంటోంది
పాదమేమో కదలనంటోంది
స్వరం పలకనంటోంది
నేను నేను కానట్టు
నాలోని నువ్వు దూరమైతే
నీలోని నేను కలవరపడినట్టు
తనువు, మనసు రెండుగా విడిపోయినట్టు
తెలియని కలవరమేదో
తికమకపెట్టి
ప్రాణమున్న కట్టెలా
పాట మరచిన కోయిలలా
ఆట మరచిన నెమలిలా
గూడు చెదిరిన గువ్వలా
చెరువు విడిచిన చేపలా
కొమ్మ నుండి జారిన సిరిమల్లెలా
అమ్మ ఒడికి దూరమైన చిన్ని పాపలా
అలా అలా ఏదో ఇలా ఇలా వున్నాను
ప్రాతఃకాలపు చిరుగాలి తెమ్మెరలా
సాయంకాలపు సిరివెన్నెలలా
అమ్మ ఒడిలోని సులివెచ్చదనంలా
వచ్చిపో యిలా వాసంత కోయిలలా
నా హృదయోద్యాన వనానికి నవ వసంతంలా!

- హేమంత (కోవూరు)

## కాగితం పూలు



అవడానికి కాగితం పూలే
సువాసన లేనివే
అయితేనేం
రెమ్మల చివర్న కూర్చుని
గాలికి సయ్యాటలాడుతుంటాయి
దారెంట వెళ్లేవాళ్ల కళ్లని
కట్టిపడేస్తుంటాయి
ఓపిగ్గా కోసి దండ గుచ్చేవాళ్లుండరు
దేవుడిని అలంకరించి
తాదాత్మ్యత నొందేవారుండరు
సిగలో తురుముకుని
నును సిగ్గులు ఒలకబోసేవారుండరు
అయితేనేం
మనుషుల్లా సువాసనలేనే
పూలని చూసి
కుళ్లిపోవు
తమ జన్మ నిరర్థకమైనదని
కుమిలిపోవు
ఒక్క రోజైనా చూసేవాళ్ల
కనులపండువుగా నిలచి
గర్వంగా నేల రాల్తాయి
అది చాలదూ వాటి జన్మ ధన్యతకు!

- ప్రతాప
వెంకటసుబ్బారాయుడు
(సికింద్రాబాద్)

☆

ఈశీర్షికకి వందల సంఖ్యలో కవితలు వస్తుంటాయి గనుక వాటిని ప్రచురణకి స్వీకరించినదీ లేనిదీ ఫోనులో చెప్పడం కష్టం. కాబట్టి కవితలు పంపించేవారు తగినన్ని స్టాంపులతో రిప్లయ్ కవరు జతచేసి వేచి చూడాల్సిందే. కవులు/కవయిత్రులు సహృదయంతో అర్థం చేసుకోగలరని మా నమ్మకం.